

# నాచి

ఆంధ్ర శేషగిరిరావు గారు

[సారస్వతసమాజము]

నాచి ఆంధ్ర బ్రాహ్మణస్త్రీ; మహా విద్వాంసురాలు. ఆంధ్రులకు సుపరిచితుడును, సుప్రసిద్ధపండితుడును నైన ఏలేశ్వరోపాధ్యాయు డామెజనకుడు. ఈపండితుని నివాసస్థానము ఏలేశ్వరము. ఇది గుంటూరుమండలము నందలి పల్నాడు తాలూకాకు సరిహద్దున కృష్ణవేణీమహానది కవ్వలి యొడ్డున నున్న పుణ్యక్షేత్రము. ప్రాంతిక జనులు ఏలేశ్వరమును దక్షిణకాశి యందురు. విధ్వంసావశిష్టము లగు దేవాలయము లా గ్రామమ్మున నేటికిని చాల గలవు. ఏటేట శివరాత్రి కక్కడ జరుగు తీర్థమునకు వేలకొలది జనులు వచ్చుచుందురు.

క్రీస్తుశకము ఏడవశతాబ్దియం దీగ్రామమున ఏలేశ్వరోపాధ్యాయుడు జీవించియుండెను. ఆతడు సంస్కృతసాహితీమండనుడు; వేదవేదాంగములయందు అనంత కౌశలము గడించిన కోవిదుడు; ఆయుర్వేదమునందు విశేషానుభవము సంపాదించిన అభిజ్ఞుడు; వేయేల ఆతడు సమస్తశాస్త్రములను సర్వాంకషముగ నేర్చిన ప్రజ్ఞానిధి.

ఆంధ్ర భూమియందు బ్రాహ్మణులలో వివాహములందు పాటింపబడుచున్న నాడు భేదములు ఏలేశ్వరోపాధ్యాయుడు కల్పించినవే ఆతడు తనకొమరితలలో నొకయామె పరిణయమప్పుడు వరుని కులవిషయమున ప్రమాదపడియెను. అందుపై నాతడు బ్రాహ్మణసంఘములో నాడుభేదము లేర్పఱచి, యేనాడువారానాడునందలి స్త్రీని మాత్రమే పెండ్లిచేసికొనవలయునని విధించెను. నాటినుండి నేటివఱకును ఆ అనుశాసనము అనుశ్రుతాచారమై ఆంధ్ర బ్రాహ్మణసంఘమున వెలయుచున్నది.

ఏలేశ్వరోపాధ్యాయుడు తానార్జించిన విద్యసంతను లోభమూని తనయందే జీర్ణము చేసికొనక శిష్యులను చేరదీసి విద్యాశిక్షణ మిచ్చెడివాడు. ఆయనయొద్ద ఎల్లప్పుడు వందలకొలది విద్యార్థులు సంస్కృతము నభ్యసించుచుండువారు. ఓరంత ప్రొద్దును ఆతని యింట సంస్కృతఘోషయే. నిరంతర మట్టి సంస్కృతఘోషనడుమ మెలగుచుండుటచే ఆతనిగృహమున స్త్రీలుసయితము సంస్కృత

మున స్వచ్ఛముగ ధారాళముగ సంభాషింప గలిగియుండిరి.

ఏలేశ్వరోపాధ్యాయునకు పురుషసంతతి లేదు. ముగ్వురు తనయలుమాత్రము కల్గిరి. అందు నాచి రెండవయామె. దురదృష్టవశమున నాచి యౌవనాశామృదుపుష్పము పూర్తిగ వికసింపకుండగనే పతిని గోల్పోయి దుర్భరమగు వైధవ్యమున ఇల్లుపట్టెను. ఏలేశ్వరోపాధ్యాయుని ప్రేమార్ద్రహృదయమప్పుడు కొలిమివలె కణకణలాడి కుమిలిపోయెను. తనకుమార్తె వైధవ్యవేదన ఆతడు చూడలేకపోయెను. ఇంక నాజన్మమున కెట్టులును తీరని అట్టిదీర్ఘవిచారమునుండి ఆమె మనస్సొకింత మరల్చుటకై ఆతడు నాచిని సంస్కృతవిద్యాభ్యాసమునకు పురిగొల్పెను.

నాచి దీక్షతో సంస్కృతము అభ్యసింపనారంభించెను. నిద్రాసుఖములను మఱచి కష్టపడి చదివినను ఆమె మందమతి యగుటచే తగినప్రయోజనము లేకపోయినది. అందు మీద విద్యాప్రియయగు నాచివిచారమునకు మేరలేకుండెను. తానెట్లైన గొప్పవిద్వాంసురాలు కావలెనని ఆమె వేగిరపడుచుండెను.

నాచివలె మందమతులగువారు ఏలేశ్వరోపాధ్యాయుని ఇతర విద్యార్థులలో కొందఱుండిరి. అట్టివిద్యార్థుల జ్ఞాపకశక్తి వృద్ధినొంది వారిబుద్ధిబలము తీవరించుటకు ఔషధము కనుగొన ఏలేశ్వరోపాధ్యాయుడు ఆయుర్వేదమందలి తన అభినివేశము నంతయు వినియోగించెను. వినియోగించి 'జ్యోతిష్మతి' యను తీగెరసమును త్రాగినచో మేధాశక్తి పెంపొందునని గ్రహించెను. ఆ ఔషధ సేవవలన నాయనశిష్యులలో మందబుద్ధులగువా రధిక మేధాసంపన్నులైరి.

సత్వరము మహావిద్యావంతురాలు కావలె నను అత్యాతురతతో నాచి ఒకనాడు జ్యోతిష్మతి రసమును మోతాదు తప్పించి మిక్కుటముగా త్రాగెను. ఆరసము పరిమాణమునకు మించినచో వికటించి విషతుల్యమగు ఫల మొసగును. అట్లారసము గ్రోలిన కొద్ది సేపటికి నామెకు అవిడితాపము, విదాహము బయలుదేరెను. ఆమె ఈఆపసోపాలికి దాళజాలక పెరటిలోనున్న బావియందు దుమికెను. అందామె ఎనిమిదిగంటలకాల ముండెను.

ఏలేశ్వరోపాధ్యాయునకు గాని, మఱి ఎవ్వరికి గాని ఈవృత్తాంత మేమియు తెలియదు. అకస్మాత్తుగ నాచి కనిపించకుండుటచే ఉపాధ్యాయుడు ఊరెల్ల నరసెను. కాని లాభము లేకపోయినది. తుద కాతడు విసిగి వేసారి పెరటిలో నూయిచెంత చదికిలబడి వెల్లుబ్బుచున్న విచార మరికట్టజాలక 'నాచీ, నాచీ' యని బిగ్గఱగా పలవింప మొదలిడెను. అప్పటికే ఆమె చాలసేపటినుంచి నీటనున్నది కావున తాపము చల్లారి కొంచెముగా తెలివి కల్గుచుండెను. అప్పు డామెకు తండ్రిపిలుపు వినిపించినది. అందుపై నామె మాఱుకేక వైచి జరిగినసంగతి నంతయు చెప్పెను. ఏలేశ్వరోపాధ్యాయు డంత పుత్రికను బావినుండి

బయటకు దీసెను. నాటినుండి నాచి మహామేధాశక్తిసంపన్నయై, అచిరకాలముననే సమస్తశాస్త్రములందును అపారపాండిత్యమును సంపాదించి తండ్రితో సమానురాలయ్యెను.

ఈగాథను మనము సత్యచరిత్రమని చేకొనినను, పుక్కిటిపురాణమని త్రోసిపుచ్చినను నాచి మహావిద్వాంసురా లనిమాత్రమొప్పుకొని తీరవలెను. సంస్కృతమున అనన్యసామాన్యమైన వైదుష్యమును సంపాదించినమీదట ఆమె కవిత్వరచనకు దొరకొనెను. ఆమె కవితావ్యాసంగమునకు అమృతఫలముగా 'నాచీ' యను దృశ్యకావ్యము ఉదయమొందినది. భాషాచాతుర్యమందేమి, భావమాధుర్యమందేమి ఆనాటకమున కదియే సాటి. ఆనాటకమున ప్రస్తావితవిషయము నాచి స్వీయజీవితచరిత్రమే. దానియందామె దుఃఖభాజనమును, దయనీయమును అగు తన వైధవ్యజీవనమును హృత్పిండములను చిదుపు కరుణారసముతో వర్ణించియున్నది.

ఆంధ్రునిది జాలిగుండె. కావుననే కరుణారసవర్ణనమున సాటిలేని నేర్పు సహజముగా నలవడ్డ దాంధ్రహృదయమునకు. కరుణారసపూరిత మైన సీతచరితము వివరించుటయందే ఆంధ్రకవయిత్రీమతల్లి మొల్ల తనకవితాచమత్కారము నంతను అవధానమొనర్చి కటికిహృదయములనుకూడ కనికారముతో నింపి ముంచెత్తుచున్నది. దుఃఖమయమైన ఆత్మోదంతమును కావ్యవస్తువుగా స్వీకరించి ఆంధ్రవిదుషీమణి నాచి కరుణారసప్లుతి కల్గించుచున్నది. ఆంధ్రుడగు భవభూతి సంస్కృతమున ఉత్తరరామచరిత్రను రచించి కరుణారసమునకవధి గల్పించినాడు. ఉత్తరరామచరిత్రలోని సీతావియోగజన్యమయిన రాముని విలాపమును వర్ణించెడి శ్లోకములు వజ్రకఠినహృదయములనుగూడ ద్రవీభూత మొనర్పగలుగును. ఆహా పుట్టునట్లు కరుణారసమును పోషించి వర్ణించుటలో ఆంధ్రున కాంధ్రుడె సాటి. ఆంధ్రున కిట్టి గొప్పపేరు వచ్చుటకు కారణభూతు లైనవారిలో నాచి యొకతె.

పరిణతవయస్సున నాచి కాశి, ప్రయాగమున్నగు సుప్రసిద్ధపుణ్యతీర్థముల సేవించి కాలమును సద్వినియోగ మొనర్చినది. ఇట్టి తీర్థసేవయం దామెకు కేవలయాత్రాభిలాషయే కాక విద్యావిజయాభిలాషకూడ మిళితమై యుండెను. సంస్కృతవిద్యకు కాణాచియైన కాశియందును, ఇతర పుణ్యస్థలములందును దిగ్దంతులవంటి పండితులతో నామె శాస్త్రవాదము నెఱపి దిగ్విజయ మందినది. ఇంతతో తృప్తి నొందక ఆపండితురాలు ఢిల్లీ, ఆగ్రా మొదలగు స్థలముల కేగి, రాజసభలయందు విద్వాంసులతో వాదము చేసి, గెలిచి, విశేషమైన బహుమతు లందినది. ఆమె యాకానుక లన్నియు దీసికొనివచ్చి తండ్రికిఁ జూపి, తనయాత్రావృత్తాంత మంతయు వినిపించెను. ఆమె గొనిన విద్యావిజయములకు తెచ్చిన పారితోషికములకు పొందిన రాచమన్ననలకు మెచ్చి, ఏలేశ్వరోపాధ్యాయుడు తనకు పుత్త్రులు లేని లోప మావంతయు

లేదని అలరెను. అట్టి మహావిద్వాంసురాలిని పుత్త్రికగా బడసిన ఏలేశ్వరోపాధ్యాయుని సంతోషమునకు కొలది లేకుండెను. కాని, ఆతనిసంతోషచంద్రిక నాచి వైధవ్యవేదన యను మేఘమును ఒత్తిగించి బహిర్గతము కాజాలక మఱుగుపడియుండెను.

సకలశాస్త్రములందును సంపూర్ణపాండిత్యము సంపాదించి, కాశి, మైసూరు, హరిద్వారము మొదలగు స్థలములయందు శాస్త్రవాదములు సల్పి దిగ్విజయములొనర్చి, మహారాజులచే మన్నన లంది, ఆంధ్రకీర్తిని దేశదేశములందు చాటివచ్చిన ఆంధ్రమహాపురుషులీరత్నగర్భయందు పెక్కురుదయించిరి. అట్టి ఆంధ్రపండితరత్నములకు పురోగామినియై, ఆంధ్రవిదుషీమణి నాచి ప్రకాశించుచున్నది. వేదయుగమున జనకమహారాజు ఆస్థానమందు బ్రహ్మజ్ఞానియు, ఋషిశ్రేష్ఠుడును నగు యాజ్ఞవల్క్యునితో అత్యద్భుతముగ శాస్త్రచర్చ సల్పి జయముగొనిన భారతమహిళ గార్గివలె ఆంధ్రపురంధ్రి నాచి భూలోకబృహస్పతులగు మహాపండితులతో తీర్థయాత్రలందు శాస్త్రవాద మొనర్చి విజయ మందినది. అట్టి విద్వాంసురాలు నాచి మహత్తరజీవితమును విని ఆనందింపని, ఆనందించి గర్వింపని ఆంధ్రు డుండునా?

కవన మల్లిన ఆంధ్రరమణులలో చరిత్రకు తెలిసినంతవఱకు తెనుగునందు మొల్లయు, సంస్కృతమునందు నాచియు మొదటివారు. అట్లగుట నీరమణీద్వయము ఆంధ్రస్త్రీలోకముచే కవితాపీఠమున తొలిపూజల నందవలసిన మహనీయురాండ్రు.

అవకాశ మిచ్చి సంస్కార మొసఁగినచో ఆంధ్రకాంతలు మొల్ల, ముద్దుపళని, వేంకమ్మ మున్నగువారివలె ఆంధ్రసారస్వతమునే కాక నాచివలె సంస్కృతవాఙ్మయమును కూడ గ్రంథరత్నములతో నలంకరించి అనశ్వరమైన యశోధనమును సముపార్జింప గలరని ఈవిదుషీమణి ధన్యజీవితము ఆంధ్రసీమాంతరములు మాఱుమ్రోగియునట్లు మేఘనినదములతో ఉద్ఘోషించుచున్నది.

—'ఆంధ్రరమణీమణులు' నుండి.

---

# నీరథము

విశ్వనాథ సత్యనారాయణ గారు

ఓ ప్రభూ! నీరథమ్ము దీక్షా ప్రణీత
విధురవేగమ్ము పరువులు వెట్టుచుండె
నాశరీరమ్ము దానిక్రిందబడి నలిగి
నలిగిపోయినయది రక్తనదము లింకి.

దివ్యతేజోవిరాజత్త్వదీయరథము
ఈగతుకు డేమి యనియైన నాగలేదు
నావిరోదించిన హతాన్నినాదమునకు
వెనుదిరిగియైన మరి చూచుకొనగలేదు.

నాదురక్తంబు నీరథచోదకుండు
కడిగివేయును రేపు చక్రములనుండి
అచటిబహుజనరక్తచిహ్నమ్ములయందు
నాది యిద్దని గుర్తేమి కన్పడును స్వామి!